జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :48 గురువారం 22-10-2026 పేజీలు:8 వెల:రు 3/—
https://www.epaperjournalistdiary.com/

టీమిండియాకు అసలైన పరీక్ష

- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో పర్యటనకు భారత్ శ్రీకారం
- వెస్టిండీస్‌తో సిరీస్ సమం కావడంతో ఒత్తిడిలో జట్టు
- బౌన్స్ పిచ్‌లపై భారత బ్యాటర్లకు సవాల్
- ఓపెనర్లు శుభారంభం అందించడం అవసరం
- బౌలింగ్‌లో భువనేశ్వర్, అర్ష్‌దీప్‌లపై ఆశలు
- ఫిన్ అలెన్, కాన్వే, ఫిలిప్స్‌తో కివీస్ పటిష్ఠం

02

నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20 పోరు

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు అసలైన పరీక్ష ఎదురుకానుంది. గురువారం ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులతో సాగే ఈ పర్యటనలో భారత్ తొలుత పొట్టి ఫార్మాట్‌లో తలపడనుంది. ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను 2-2తో ముగించిన భారత జట్టుకు కివీస్ గడ్డపై సవాల్ మరింత కఠినంగా మారింది. బౌన్స్‌కు అనుకూలించే పిచ్‌లపై బ్యాటర్లు సత్తా చాటడంతోపాటు బౌలర్లు సమష్టిగా రాణిస్తేనే భారత్‌కు విజయావకాశాలు మెరుగవుతాయి.

02

2029 నాటికి దేశంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యం

- మాదకద్రవ్యాలపై దేశవ్యాప్త ఉద్యమానికి అమిత్ షా శ్రీకారం
- 2029 డిసెంబర్ 31లోగా డ్రగ్స్ ముప్పును అంతం చేయాలని పిలుపు
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో నివాళులు
- న్యూఢిల్లీలో బైక్ ర్యాలీని ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి
- ర్యాలీలో పాల్గొన్న సుమారు 90 మంది పోలీసు బైక్ రైడర్లు
- కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, దర్యాప్తు సంస్థల భాగస్వామ్యం
- ప్రజల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన పెంపునకు ప్రచారం

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

హైదరాబాద్,
ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు కీలకమని, అందుకే తమ ప్రభుత్వం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పోలీసు శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని, 2027లోగా అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందించే పరిహారాన్ని తమ ప్రభుత్వం పెంచిందని సీఎం గుర్తుచేశారు. కానిస్టేబుళ్లకు గతంలో రూ.40 లక్షలుగా ఉన్న ఎక్స్‌గ్రేషియాను రూ.కోటికి పెంచామని తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు రూ.45 లక్షల నుంచి రూ.కోటికి,

-మిగతా 2 లో

- 2027లోగా శాఖలో అన్ని ఖాళీల భర్తీకి చర్యలు
- మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధం
- హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపుపై సీఎం ప్రకటన
- అమరుల కుటుంబాల గౌరవార్థం పరిహారాన్ని పెంచామని వెల్లడి
- డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ కృషిపై ప్రశంసలు
- నిజాయతీగా ప్రజలకు సేవ చేయడమే అమరులకు నిజమైన నివాళి: డీజీపీ
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు

విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పరిహారాన్ని పెంచామని, పోలీసు శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. 2027లోగా అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. మరోవైపు, ప్రజలకు నిజాయతీగా సేవలందిస్తూ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు.

దీపావళిలోగా పదవుల పందేరం!

- నామినేటెడ్ పోస్టుల భర్తీపై సీఎం, పీసీసీ చీఫ్ కసరత్తు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు ప్రాధాన్యం
- మూడు స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించే యోచన
- పద్మశాలి సామాజికవర్గం నుంచి బీసీ మహిళకు అవకాశం?
- కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల ఎంపికపై చర్చ
- 30కి పైగా నామినేటెడ్ పదవుల గడువు ముగింపు
- ముగ్గురు చైర్మన్ల కొనసాగింపుపై పార్టీ వర్గాల్లో అంచనాలు

/హైదరాబాద్:
తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల దీపావళిలోగా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల నియామకాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు నవంబర్‌లో గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు మహేష్ కుమార్ గౌడ్ ఆయన నివాసానికి

02

మొదటి టార్గెట్ సల్మాన్ ఖాన్!

- టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసులో పోలీసుల దర్యాప్తు
- తొలుత సల్మాన్ ఇంటి వద్ద నిందితుల రెక్కీ
- భద్రత ఉండటంతో లక్ష్యాన్ని మార్చుకున్నట్లు సమాచారం
- ఫుట్‌బాల్ మైదానంలో టైగర్‌పై కాల్పులకు తెగింపు
- సోషల్ మీడియా ద్వారా నటుడి కదలికలపై ఆరా
- సల్మాన్‌తో పనిచేసేవారికి నిందితుల హెచ్చరిక
- ముంబై సినీ పరిశ్రమలో కలకలం
- నిందితుల కదలికలపై పోలీసుల దర్యాప్తు

జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్.. సిఎం చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

- పిటిషన్లతో ఎన్నికలు, అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపణ
- జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలని నేతలకు సూచన
- క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు

07

ఎన్నికల బరిలోకి తెలంగాణ రక్షణ సేన

- వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీకాంత్ గౌడ్
- దసరా సందర్భంగా అభ్యర్థి పేరును ప్రకటించిన కల్వకుంట్ల కవిత
- పార్టీ ఆవిర్భావం తర్వాత తొలి ప్రత్యక్ష ఎన్నికల పోటీ
- కాకతీయ యూనివర్సిటీ నుంచి శ్రీకాంత్ గౌడ్ పీహెచ్‌డీ
- తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న అభ్యర్థి
- తెలంగాణ జాగృతి ఆవిర్భావం నుంచే కవితతో కలిసి పనిచేస్తున్న శ్రీకాంత్
- ప్రస్తుతం పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు
- ఎన్నికల సమన్వయకర్తగా సయ్యద్ ఇస్మాయిల్ నియామకం

హైదరాబాద్,
తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తమ పార్టీ తరఫున తొలి ఎన్నికల అభ్యర్థిని ప్రకటించారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను బరిలోకి దించుతున్నట్లు మంగళవారం వెల్లడించారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేన ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట

-మిగతా 2 లో

02

శత్రు శక్తులను ఓడించేందుకు ఏకం కావాలి!

- దేశ ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యంగా పనిచేయాలి
- దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై సమష్టి పోరాటం
- ఢిల్లీలో విజయదశమి వేడుకల్లో ప్రధాని మోదీ పిలుపు
- సుపరిపాలనకు ఆదర్శమని వ్యాఖ్య
- ప్రజలకు న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే పాలన లక్ష్యం
- ధర్మం, న్యాయం, ఐక్యతను చాటే విజయదశమి
- స్వయం సమృద్ధ భారత్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- దేశ వనరులు, సామర్థ్యాలపై ప్రజలకు విశ్వాసం ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లపై... రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత

- నామినేషన్ల దాఖలుకు నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం లేదని వెల్లడి
- ఈ కారణంతో నామినేషన్లను తిరస్కరించవద్దని అధికారులకు ఆదేశం
- నామినేషన్ల అడ్డంకులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రకటన



06

ఏపీ 'మున్సిపల్' ఎన్నికలపై.. ఎస్ఈసీకి 'సుప్రీంకోర్టు' కీలక 'ఆదేశాలు',

- అభ్యర్థుల జాబితా వాయిదా
- వైసీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ
- నామినేషన్ల గడువు పెంపునకు నిరాకరణ
- ఫిర్యాదులున్న 19 చోట్ల పరిశీలించాలని ఎస్ఈసీకి ఆదేశం
- అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా
- నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా?వద్దా? -అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి ఆదేశం
- అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని ఆదేశం
- తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలి

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించిన ధర్మాసనం, వైసీపీ ఫిర్యాదు చేసిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రం పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించింది. దీంతో పాటు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసింది.

వైసీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ

తమ అభ్యర్థులను 19 చోట్ల నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని, ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతుంటే రాజ్యాంగ కోర్టులు మౌనంగా ఉండలేవని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించిన సుప్రీంకోర్టు

ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాటిని పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా వద్దా అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని సూచించింది.

తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలి

ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది

కివీస్ గడ్డపై టీమిండియాకు కఠిన పరీక్ష!

-నేడు న్యూజిలాండ్‌తో తొలి టీ20 పోరు
-ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో పర్యటనకు భారత్ శ్రీకారం
-వెస్టిండీస్‌తో సిరీస్ సమం కావడంతో ఒత్తిడిలో జట్టు
-బౌన్స్ పిచ్‌లపై భారత బ్యాటర్లకు సవాల్
-ఓపెనర్లు శుభారంభం అందించడం అవసరం
-బౌలింగ్‌లో భువనేశ్వర్, అర్ష్‌దీప్‌లపై ఆశలు
-ఫిన్ అలెన్, కాన్వే, ఫిలిప్స్‌తో కివీస్ పటిష్ఠం

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు తొలి సవాల్ ఎదురుకానుంది. గురువారం ఇరు జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. తొలుత టీ20 సిరీస్‌తో పోరు ప్రారంభం కానుంది. ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేసుకుంది. ఈ నేపథ్యంలో కివీస్ గడ్డపై భారత జట్టు ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. న్యూజిలాండ్ పిచ్‌లు బౌన్స్‌కు అనుకూలంగా ఉండటంతో భారత బ్యాటర్లకు పరీక్ష ఎదురుకానుంది. స్వదేశంలోనే వెస్టిండీస్ నుంచి గట్టి పోటీ ఎదురైన నేపథ్యంలో విదేశీ గడ్డపై మరింత అప్రమత్తంగా ఆడాల్సిన అవసరం ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణిస్తేనే భారత్‌కు విజయావకాశాలు మెరుగవుతాయి. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ తనదైన ముద్ర వేయాల్సి ఉంది. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ జట్టుకు శుభారంభం అందించాలి. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. బౌలింగ్‌లో భువనేశ్వర్ రాకతో జట్టుకు బలం చేకూరనుంది. అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ వికెట్లు తీయడంపై భారత్ ఆశలు పెట్టుకుంది. మరోవైపు స్వదేశంలో ఆడుతున్న న్యూజిలాండ్ జట్టు కూడా పటిష్ఠంగా ఉంది. ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, బ్రేస్‌వెల్‌తో పాటు కెప్టెన్ సాంటీర్ జట్టుకు కీలకం కానున్నారు. వీరిని కట్టడి చేయడంతో పాటు ప్రత్యర్థి పిచ్‌లపై పరిస్థితులకు అనుగుణంగా ఆడటం టీమిండియాకు ప్రధాన పరీక్షగా నిలవనుంది.

2029 నాటికి దేశంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యం



న్యూఢిల్లీ

2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో మాదకద్రవ్యాల ముప్పును నిర్మూలించేందుకు సమష్టిగా, నిరంతరంగా పోరాడాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బుధవారం న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక స్థూపం వద్ద నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న ఆయన.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం దేశవ్యాప్త మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు. నిర్దేశించిన గడువులోగా దేశం నుంచి మాదకద్రవ్యాల మహమ్మారిని తొలగించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అమిత్ షా సూచించారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీలో సుమారు 90 మంది పోలీసు బైక్ రైడర్లతో కూడిన ర్యాలీని అమిత్ షా జెండా ఊపి ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్, బీఎస్‌ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ, ఎన్ఎస్‌జీతో పాటు ఆర్‌ఓఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎన్ఐఏ సంస్థల ప్రతినిధులు కూడా ఉద్యమంలో భాగస్వాములయ్యారు. 'డ్రగ్స్‌పై పోరాటం' నినాదంతో సాగుతున్న ఈ ర్యాలీలో పాల్గొనే బైక్ రైడర్లు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర బలగాల నుంచి గుజరాత్‌లోని ఏక్తా నగర్‌కు చేరుకోనున్నారు. అక్కడ అక్టోబర్ 31న నిర్వహించనున్న ఏక్తా పరేడ్-2026లో పాల్గొంటారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ప్రజలను చైతన్యవంతం చేయడం, వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కేంద్రం పేర్కొంది.

మొదటి టార్గెట్ సల్మాన్ ఖాన్!



ముంబై

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై ఇటీవల కాల్పులకు పాల్పడిన ముగ్గురు నిందితులు తొలుత నటుడు సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు విశ్వసనీయ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం సల్మాన్ నివాసం వద్ద రెక్కీ నిర్వహించినట్లు తెలిపాయి. అయితే అక్కడ పోలీసు భద్రత ఉండటాన్ని గమనించిన నిందితులు తమ ప్రణాళికను మార్చుకుని టైగర్ ష్రాఫ్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. టైగర్ ష్రాఫ్ ప్రతి ఆదివారం జుహూలోని ఓ ఫుట్‌బాల్ మైదానానికి వెళ్తాడనే విషయాన్ని నిందితులు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఆ మైదానం వద్ద భద్రత పరిమితంగా ఉంటుందని భావించి, అక్కడే అతడిపై కాల్పులకు తెగబడినట్లు వెల్లడించాయి. కాల్పుల అనంతరం నిందితులు సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు పెట్టి హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేయొద్దని తాము చేసిన హెచ్చరికలను ముంబై సినీ పరిశ్రమలో ఎవరైనా పట్టించుకోకపోతే వారే తమ తదుపరి లక్ష్యమని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో బాలీవుడ్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కాల్పుల ఘటన వెనుక ఉన్న కారణాలు, నిందితుల కదలికలు, వారు చేసిన హెచ్చరికలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఢిల్లీలో క్షీణించిన వాయు నాణ్యత జీఆర్‌ఏపీ-1 ఆంక్షలు అమలు

న్యూఢిల్లీ:
ఢిల్లీ కాలానుగుణ కాలుష్య నియంత్రణ చర్యల్లో మొదటి దశ బుధవారం తొలిసారి ప్రారంభమైంది. ఎన్‌సీఆర్ ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ మొదటి దశను విధించారు. దసరా ఉత్సవాల తర్వాత బుధవారం వాయు నాణ్యత సూచిక 245 పాయింట్లుగా నమోదైంది. జీఆర్‌ఏపీ మొదటి దశలో భాగంగా హోటళ్లలో బొగ్గు, వంట చెరకును ఇంధనంగా ఉపయోగించడంపై నిషేధం అమలవుతుంది. అత్యవసర సందర్భాల్లో డీజిల్ జనరేటర్లను మాత్రమే వాడాలి.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

మొదటి తరువాయి

ఎస్‌ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.1.25 కోట్లకు పెంచినట్లు వివరించారు. డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్ల పరిహారం అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇవి కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, అమరవీరుల కుటుంబాల పట్ల ప్రభుత్వ గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని సీఎం తెలిపారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు ఇందులో అవకాశం కల్పించామని చెప్పారు. మారుతున్న నేర స్వభావానికి అనుగుణంగా పోలీసు శాఖను ఆధునీకరిస్తామని, ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తామని వెల్లడించారు. అయితే సాంకేతికత పెరిగినా పోలీసులు మానవీయ దృక్పథాన్ని కోల్పోకూడదని సూచించారు. డ్రగ్స్, గంజాయి వ్యాప్తి యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందిస్తున్నామని తెలిపారు. మహిళల భద్రతను బలోపేతం చేసేందుకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. మహిళలకు అండగా నిలిచేందుకు ఈ ఏడాది మార్చిలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మహిళలు, పిల్లలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణ అందించేందుకు ఏప్రిల్‌లో 'స్పందన' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం చేయడంలో జాప్యం జరగకూడదని సూచించారు. మహిళల భద్రత పోలీసులకే పరిమితం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి, వారి కుటుంబాల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. తీవ్రవాదం, నక్సలిజం, మావోయిజం, ఇతర అసాంఘిక శక్తులను ఎదుర్కొనే క్రమంలో తెలంగాణలో వందలాది మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. వారి ధైర్యసాహసాల వల్లే రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడి అభివృద్ధికి మార్గం సుగమమైందన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 154 మంది పోలీసులు అమరులయ్యారని, వారిలో తెలంగాణకు చెందిన ఎస్ఐ దేవేసింగ్, కానిస్టేబుళ్లు ఎంవల్లి ప్రమోద్‌కుమార్, శీలం కరుణాకర్ ఉన్నారని తెలిపారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని డీజీపీ సూచించారు. ప్రస్తుతం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో సుమారు 350 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, మంచిరేవులలో శాశ్వత ప్రాంగణం పూర్తయితే సుమారు 720 మందికి విద్య అందించే అవకాశం ఉంటుందని వివరించారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తూ, ప్రజలకు నిజాయతీతో సేవలందించడమే పోలీసు అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

దీపావళిలోగా పదవుల పందేరం!

మొదటి తరువాయి

వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల రెండు గ్రాడ్యుయేట్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక చేసిన అభ్యర్థులు ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఏర్పడిన పరిస్థితిని సమతుల్యం చేసే దిశగా గవర్నర్ కోటా స్థానాల కేటాయింపుపై చర్చించినట్లు సమాచారం. బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు, బీసీ రిజర్వేషన్లు, జనగణనలో బీసీ గణన వంటి అంశాలపై పార్టీ వైఖరిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా పద్మశాలి సామాజికవర్గానికి చెందిన బీసీ మహిళకు ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయించే అవకాశాన్ని పరిశీలించినట్లు సమాచారం. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించినప్పుడు పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్యేగా చేస్తామని ఇచ్చిన హామీని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించినట్లు కథనంలో పేర్కొన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీని దసరా నాటికే చేపట్టాలని భావించినప్పటికీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించి పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చిన ఆందోళన కార్యక్రమాలు, ఢిల్లీ పర్యటనలతో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, అధిష్ఠానం ఆమోదం తీసుకున్న అనంతరం దీపావళిలోగా నియామకాలు చేపట్టాలని నేతలు చర్చించినట్లు సమాచారం. ఇటీవల 30కి పైగా నామినేటెడ్ పదవుల గడువు ముగియగా, కొందరు చైర్మన్లను మినహాయించి మిగిలిన స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. టీజీబీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలను కొనసాగించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకునేందుకు పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రభావం, రాష్ట్ర ఖజానాపై అప్పుల భారం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపు, నామినేటెడ్ పోస్టుల నియామకాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

భవిష్యత్తులో తెలంగాణకు బీసీ సీఎం

-బీసీ నేత ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువూ లేదు
-2039 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ధీమా
-రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అయినా అభ్యంతరం లేదు
-రాహుల్ గాంధీ ఆలోచనే బీసీ సీఎం నినాదం
-ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చాం
-బీఆర్ఎస్ బీసీని సీఎంను చేయగలదా?
-రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదన్న టీపీసీసీ చీఫ్

తెలంగాణ బ్యూరో,
తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేష్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

శత్రు శక్తులను ఓడించేందుకు ఏకం కావాలి!

న్యూఢిల్లీ:
దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని సంస్థలు, రాజకీయ పార్టీలు ఏకమై పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశానికి ముప్పు కలిగించే శక్తులను ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాజకీయ పార్టీలన్నీ ముందుకు సాగాలని సూచించారు. ఢిల్లీలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ఆయన, దేశ సమగ్రత, భద్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ 'దేశమే ప్రథమం' అనే సంకల్పంతో పనిచేయాలని అన్నారు. భారతమాతకు శత్రువులుగా నిలిచే శక్తులను గుర్తించి, వాటిని ఓడించేందుకు ఐక్యంగా కృషి చేయాలని పౌరులకు పిలుపునిచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి, సమాజంలో ధర్మం, న్యాయం, ఐక్యతలను బలోపేతం చేయాలనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. దసరా పండుగ అందించే స్ఫూర్తి భారతీయ తాత్విక చింతనలో అంతర్భాగమని వివరించారు. రామరాజ్యం నేటికీ సుపరిపాలనకు ఆదర్శంగా నిలుస్తోందని మోదీ అన్నారు. రామరాజ్యంలో ఎవరి పట్లా వివక్ష ఉండదని, ప్రతి ఒక్కరికీ న్యాయం, సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అధికారం అంటే కేవలం పాలించడం మాత్రమే కాదని, ప్రజల సంక్షేమాన్ని నిర్ధారించడమే నిజమైన పాలన అని శ్రీరాముడి ఆదర్శాలను ప్రస్తావించారు. భారత్‌ను స్వయం సమృద్ధ దేశంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. దేశంలోని వనరులు, సామర్థ్యాలపై ప్రజలు పూర్తి విశ్వాసం కలిగి ఉండాలని సూచించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, ఐక్యతతో అభివృద్ధి పథంలో ముందుకు సాగినప్పుడే బలమైన, స్వావలంబన కలిగిన భారత్‌ను నిర్మించగలమని పిలుపునిచ్చారు.

ఎన్నికల్ల బరిలోకి తెలంగాణ రక్షణ సేన

మొదటి తరువాయి

మండలం కౌసల్యాదేవిపల్లికి చెందిన శ్రీకాంత్ గౌడ్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన, తెలంగాణ జాగృతి ఆవిర్భావం నుంచే కవితతో కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్తగా, పరిశీలకుడిగా సయ్యద్ ఇస్మాయిల్‌ను కవిత నియమించారు. పార్టీ స్థాపన తర్వాత తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగుతున్న నేపథ్యంలో ఈ అభ్యర్థిత్వ ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎస్‌బీఐ యూజర్ల డాటా లీక్

సైబర్ దాడి నిజమేనన్న బ్యాంక్
3,897 మంది ఖాతాదారుల వివరాలు డార్క్‌వెబ్‌లో బహిర్గతం

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)పై సైబర్ దాడి జరిగినట్టు యాజమాన్యం అంగీకరించింది. హ్యాకర్లు బ్యాంక్‌నకు చెందిన వినియోగదారులు రికార్డులను యాక్సెస్ చేసినట్టు తెలిపింది. స్టాక్ ఎక్స్చేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో 3,897 మంది వినియోగదారుల వ్యక్తిగత వివరాలు డార్క్‌వెబ్‌లో బహిర్గతమై ఉండవచ్చునని వెల్లడించింది. ఈ ఘటన కారణంగా బ్యాంక్ ప్రధాన కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, వ్యాపార లావాదేవీలపై ఎలాంటి గణనీయమైన ప్రభావం పడలేదని వివరించింది. వినియోగదారుల ఖాతాల డాటా లీక్ గురించి ఈ నెల 16న తమ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్ సీఈఆర్‌టీ-ఇన్ నుంచి తమకు హెచ్చరిక అందిందని ఎస్‌బీఐ తెలిపింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

అధర్మం ఎన్ని రూపాల్లో ఎదురైనా.. ధర్మమే అంతిమంగా విజయం సాధిస్తుంది

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ధర్మ విజయానికి ప్రతీకగా రావణ దహనం..!

బంగారు మైసమ్మ తల్లి సన్నిధిలో అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

అందె మోహన్ ఆధ్వర్యంలో అంబరాన్ని అంటిన దసరా వేడుకలు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ బైపాస్ రోడ్డులో గల బంగారు మైసమ్మ తల్లి దేవాలయ ఆవరణలో రావణ దహన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తులు, పట్టణ ప్రజల సమక్షంలో భక్తిశ్రద్ధలు, ఉత్సాహంతో ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలోని దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రావణ దహన కార్యక్రమంలో పాల్గొని వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విజయదశమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, మనిషి జీవితానికి విలువైన ఆధ్యాత్మిక సందేశాన్ని అందించే పవిత్రమైన పర్వదినమని అన్నారు. శ్రీరాముడు సత్యం, ధర్మం, న్యాయానికి ప్రతీకగా నిలిస్తే.. రావణుడు అధర్మం, అహంకారం, దురాశకు ప్రతీకగా నిలిచాడని పేర్కొన్నారు. ఎంతటి శక్తి, సంపద, సామర్థ్యం ఉన్నప్పటికీ అహంకారం, అధర్మం చివరకు పతనానికే దారితీస్తాయని రామాయణం మనకు బోధిస్తుందని అన్నారు.
రావణ దహనం ద్వారా మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, కోపం, చెడు ఆలోచనలను కూడా దహనం చేసుకోవాలనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఎమ్మెల్యే సూచించారు. ధర్మం, సత్యం, న్యాయం, మానవత్వం వైపు అడుగులు వేస్తే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని అన్నారు. విజయదశమి ప్రతి ఒక్కరి జీవితంలో చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం సాధించే విజయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలతో, ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో షాద్‌నగర్ ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బంగారు మైసమ్మ తల్లి దేవాలయ ఆవరణలో నిర్వహించిన రావణ దహన మహోత్సవం భక్తులను, పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. రావణ ప్రతిమ దహనం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో సోలిపూర్ బైపాస్ ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల మేళవింపుతో సాగిన ఈ వేడుకలు విజయదశమి పర్వదినానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, కేకే కృష్ణ, కౌన్సిలర్ సి. పెంటయ్య, ముబారక్ అలీ ఖాన్, గుట్ట రాజు, జాంగారి రవి, మాధవులు యాదవ్, అనిల్, లింగారెడ్డిగూడ అశోక్, ప్రదీప్ ముదిరాజ్, నీరటి వాసు, మనీష్, మహేందర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

నాగారం వెస్ట్ గాంధీనగర్‌లో నేతాజీ విగ్రహ ఆవిష్కరణ కు భూమి పూజ....

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ)
నాగారం డివిజన్ వెస్ట్ గాంధీనగర్ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు దసరా పండుగ సందర్భంగా కాలనీలలో భూమి పూజ చేశారు. కాలనీకి చెందిన
వి మధుసూదన్ రెడ్డి మరియు కాలనీ సభ్యులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ
ఈ రోజు మన పిల్లలకు సినిమా హీరోలు తెలుసు కానీ, దేశం కోసం ప్రాణం ఇచ్చిన నిజమైన హీరోలు, దేశభక్తులు తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగారం లాంటి మన గ్రామంలో నేతాజీ విగ్రహం ఉంటే, ప్రతి రోజు స్కూల్ కి వెళ్లే పిల్లాడు ఆ విగ్రహాన్ని చూసి "నేను కూడా దేశం కోసం ఏదైనా చేయాలి" అనే స్ఫూర్తి తో ముందుకు పోతారని అన్నారు.
ఇది కేవలం విగ్రహం కాదు, మన దేశభక్తికి గుర్తు, మన యువతకు దారి చూపే దీపం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ కౌకుంట్ల అనంతరెడ్డి, బిజ్జు శ్రీనివాస్ గౌడ్, మద్ది రెడ్డి వెంకట్ రెడ్డి, బిజెపి నాయకులు రామక్కపేట రవీందర్ రెడ్డి, ఎండి జలీల్, యువకులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీర్యాలలో దసరా పర్వదినాన ప్రత్యేక పూజలు..

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ)
విజయదశమి దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కీసర మండలం చీర్యాల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. జమ్మి చెట్టు కు ప్రత్యేక పూజలు చేసారు.
శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

సిద్ధాపూర్‌లో దసరారోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు.!

మజ్జిగ ఇచ్చి దీక్షలను విరమింపజేసిన ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప, పసుపుల ప్రశాంత్..!

గ్రామాన్ని దత్తత తీసుకున్న మహేష్ బాబు ఎక్కడ.!

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ రద్దు చేసే వరకు పోరాటం..!

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :
దేశవ్యాప్తంగా ఓవైపు ఈ దేశ ప్రజలు ప్రభుత్వ అధికారులు పాలకులు విజయదశమి (దసరా) పండుగను జరుపుకుంటుంటే రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామస్తులు మాత్రం దసరా పండుగ రోజు కూడా సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని 641 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధాపూర్ గ్రామస్తులు గత 17 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని ఈ దేశ ప్రజలు దసరా పండుగను నిర్వహించుకుంటుంటే సిద్ధాపూర్ గ్రామస్తులు మాత్రం రిలే నిరాహార దీక్షలు పట్టుదలతో చేస్తున్నారు. ఈ రిలే నిరాహార దీక్షలకు ముఖ్య అతిథితులుగా హాజరైన ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప, పసుపుల ప్రశాంత్ దీక్షలను విరమింప చేస్తూ ప్రసంగించారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు సంబంధించిన ముఖ్యమంత్రిగా ఉంటూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రాంత ప్రజలను చెత్తకుప్పల్లోకి నెట్టడం ఎలా సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు పచ్చటి పంట పొలాల ఉన్న ఈ ప్రాంతంలో చెత్తను తీసుకొచ్చి పోస్తే ఈ ప్రాంత ప్రజలు ఎలా బ్రతుకుతారని వారి జీవన స్థితిగతులు ఎంత దారుణంగా తయారవుతాయో ఆలోచించాలన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి 641 జీవోను రద్దు చేయాలని డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు లేదంటే మరో జెంజి ఉద్యమాన్ని నిర్వహించేందుకు కూడా వెనకాడబోమన్నారు ..
గ్రామాన్ని దత్తత తీసుకున్న మహేష్ బాబు ఎక్కడ? శ్రీమంతుడు సినిమాలో ఫైటింగ్ చేసినట్లు ఇప్పుడు కూడా ఫైటింగ్ చెయ్యాలి!సిద్ధాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన సినీ నటుడు మహేష్ బాబు ఈ ప్రాంతంలో ఇంత పెద్ద ఉద్యమం నడుస్తుంటే అసలు ఎక్కడున్నారని ఎందుకు స్పందించడం లేదని శ్రీమంతుడు సినిమాలో ఓ గ్రామంలో జరుగుతున్న అన్యాయంపై ఫైటింగ్ చేసి అన్యాయాన్ని ఎదిరించిన సినీ నటుడు మహేష్ బాబు ఇప్పటివరకు ఎందుకు స్పందించడం లేదని శ్రీమంతుడు సినిమాలో ఫైటింగ్ చేసినట్లు ఇప్పుడు కూడా ఫైటింగ్ చేయాలని తమ గ్రామాన్ని కాపాడాలని కోరుతున్నారు ఇప్పటికైనా మహేష్ బాబు స్పందించి ప్రభుత్వ దృష్టికి ఈ చెత్త డంపింగ్ యార్డ్ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్ అర్జునప్ప, జేఏసీ గ్రామ కమిటీ అధ్యక్షులు రాజేందర్రెడ్డి, కార్యదర్శి శ్రీధరా చారి, సభ్యులు నరేందర్ రెడ్డి, ఆరు ప్రశాంత్, మహేష్, చరణ్, శంకరయ్య, నజీర్, వినయ్, శ్రీకాంత్, రవి, నరేష్, శ్రీకాంత్, వినయ్, ఐలేష్, దశరథ్, శరత్ తదితరులు పాల్గొన్నారు...

నాగారం,కీసరలలో వైభవంగా దసరా పండుగ

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ)
నాగారం, కీసర డివిషన్‌లలో ఉత్సవాలు వైభవంగా మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయదశమి జెండాలను ఆవిష్కరించారు. కీసర లో దసరా పండుగ సందర్భంగా పాత గ్రామపంచాయతీ వద్ద అన్ని వర్గాల ప్రజలు కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొని, పూజ అనంతరం జెండా ఆవిష్కరణ, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజ నిర్వహించారు. అదేవిధంగా నాగారం ఈస్ట్ గాంధీనగర్ సాయిబాబా దేవాలయం వద్ద విజయదశమి జెండా ను ఆవిష్కరించి జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి పి వెంకటేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత సహా గ్రామాల ప్రజలందరూ ఏకమై సామరస్యంగా, సంతోషంగా దసరా వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామాల ఐక్యతకు, సంప్రదాయ ఆచారాలకు ప్రతీకగా నిలిచింది.

పండుగ సాయన్న జయంతి వేడుకలను విజయవంతం చేయండి

షాద్‌నగర్ బీజేపీ నాయకులు అందె బాబయ్య పిలుపు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :
తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న వీరయోధుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు అందె బాబయ్య పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ ప్రముఖులు బుర్ర జ్ఞానేశ్వర్, వాకిటి శ్రీహరి చొరవతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి పండుగ సాయన్న జయంతి (అక్టోబర్ 22), వర్ధంతి (డిసెంబర్ 10)లను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఇందుకు ముదిరాజ్ సమాజం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిరంకుశ రజాకార్లు, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ పేదలకు అండగా నిలిచిన పండుగ సాయన్న పాలమూరు రాబిన్‌హుడ్‌గా, పేదల పెన్నిధిగా చరిత్రలో నిలిచిపోయారని అందె బాబయ్య కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అక్టోబర్ 22న షాద్‌నగర్ మెయిన్ కూడలి (ఏబీ కాంప్లెక్స్) నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, బ్లాక్ ఆఫీస్ వద్ద ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే, ముదిరాజ్ సంఘం పెద్దలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది ముదిరాజ్ బంధువులతో నిర్వహించనున్న అధికారిక జయంతి వేడుకలకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందె బాబయ్య విజ్ఞప్తి చేశారు.

నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్న ఎమ్మెల్యే సోదరుడు

-గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల్లో అనూహ్య పరిణామం...

గిద్దలూరు,మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నామినేషన్ ప్రక్రియలో కూటమి తరుపున అభ్యర్థిగా ఉన్న బిజెపి నేతకు పోటీగా, రెబెల్ అభ్యర్థిగా ఇండిపెండెంట్ గా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్ రెడ్డి మూడు నామినేషన్ పత్రాలను వేసిన విషయం తెల్సిందే.. అయితే బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది.ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్ రెడ్డి ఎన్నికల అధికారి వద్దకు వెళ్లి తాను వేసిన మూడు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో సర్వత్రా ఈ విషయం తీవ్ర చర్చాంశనీయంగా మారింది.. దీంతో పోటీలో బిజెపి అభ్యర్థికి మార్గం సుగమం అయినట్లుగా తెలుస్తుంది

బోడుప్పల్, మేడిపల్లి డివిజన్లలో ఘనంగా దసరా వేడుకలు..

- ముఖ్య అతిథిగా తోటకూర వజ్రేష్ యాదవ్

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్, మేడిపల్లి డివిజన్లలో దసరా పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బోడుప్పల్ డివిజన్‌లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జమ్మి చెట్టు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేడిపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పండుగ విశిష్టతను గుర్తుచేసుకుంటూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ వేడుకలు ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సాంస్కృతిక సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చెడు పై విజయమే దసరా... మేడ్చల్ ఎమ్మెల్యే చేమకూర మల్లారెడ్డి...

- దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) చెడు పై విజయమే దసరా పండుగ అని, ప్రజలు మంచి మార్గం వైపు పయనించి సుభిక్షమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చేమకూర మల్లారెడ్డి అన్నారు. విజయదశమి దసరా పండుగ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం బోయినపల్లి లోని దాస ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన శమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
అలాగే కంటోన్మెంట్ గ్రౌడ్ లో జరిగిన శమి పూజ మరియు రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో అయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఘనంగా రావణ దహనం..

పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో మంగళవారం రాత్రి రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు దసరా పండుగ విశిష్టతను, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా రావణ దహనానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా వేడుకల్లో భాగస్వాములయ్యారు.

ఎన్నికలంటే వైసీపీకి భయం, కేసులతో అడ్డుకునే కుట్ర...టిడిపి

- రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు
- -ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందన్న పల్లా శ్రీనివాస్
- -స్థానిక ఎన్నికల ప్రక్రియను నిలిపేందుకు 60కి పైగా పిటిషన్లు
- -కడప జిల్లాలో ఉద్రిక్తతలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం
- -న్యాయస్థానాల ఆదేశాలకు కట్టుబడి ఉంటామన్న టీడీపీ
- -మెగా డీఎస్సీ, అమరావతి విషయం లోనూ అడ్డంకులు సృష్టించారని ఆరోపణ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేకనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేసులు, వివాదాలతో స్థానిక ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు సృష్టించడం, మరోవైపు వాటినే సాకుగా చూపి న్యాయస్థానాలను ఆశ్రయించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.
ప్రజాక్షేత్రంలో ఆదరణ కోల్పోయిన వైఎస్ జగన్, కోర్టుల ద్వారా ఎన్నికలకు ఆటంకాలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.
సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..
స్థానిక ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కల్పించేందుకు బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ వంటి అంశాలపై వైసీపీ దాదాపు 60 పిటిషన్లు వేసిందని పల్లా ఆరోపించారు. ప్రజల వద్దకు వెళ్లి మద్దతు కోరాల్సిన పార్టీ, న్యాయపరమైన వివాదాలతో ఎన్నికలను నిలువరించాలని చూడటం విడ్డూరంగా ఉందని అన్నారు.
న్యాయస్థానం ఇచ్చే తీర్పులకు టీడీపీ కట్టుబడి ఉంటుంది
సుప్రీంకోర్టు పట్ల తమకు అత్యంత గౌరవం ఉందని, న్యాయస్థానం ఇచ్చే తీర్పులకు టీడీపీ కట్టుబడి ఉంటుందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.
ఎన్నికల గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకోవాల్సింది రాష్ట్ర ఎన్నికల సంఘమేనని, ఈ విషయంలో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. న్యాయస్థానాల ఆదేశాలపై అనవసర రాజకీయాలు చేయడం తగదన్నారు.
విధ్వంసం జరుగుతోందని తప్పుడు ప్రచారం
ఉమ్మడి కడప జిల్లాలో స్థానిక ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతాయని తాము ముందే ఊహించామని పల్లా పేర్కొన్నారు. రాజంపేట, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం సహా పలు ప్రాంతాల్లో వైసీపీ ముఠాలు ఉద్రిక్తతలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. బెంగళూరులో కూర్చొని వ్యూహాలు రచిస్తూ, ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులను రప్పించి అలజడులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనలనే సాకుగా చూపి రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.
వైసీపీ ఆధిపత్యాన్ని ఎదుర్కొని టీడీపీ శ్రేణులు నిలబడ్డాయి
పులివెందులలో దశాబ్దాలుగా ఉన్న వైసీపీ ఆధిపత్యాన్ని ఎదుర్కొని టీడీపీ శ్రేణులు నిలబడ్డాయని, ఇప్పుడు అక్కడ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి రావడం వైసీపీ నేతలకు ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. కేవలం ఎన్నికలే కాకుండా, మెగా డీఎస్సీ నియామకాలు, అమరావతి, పోలవరం వంటి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం కూడా వైసీపీకి అలవాటుగా మారిందని పల్లా దుయ్యబట్టారు.
ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేసినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదు
క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న నేతలున్న పార్టీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని పల్లా ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేసినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ, ప్రజాస్వామ్యబద్ధంగా వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజాతీర్పును ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు

రాక్ టౌన్ కాలనీలో అంబరాన్నంటిన విజయదశమి సంబరాలు

- 2 వేల మందితో ఘనంగా వేడుకలు.. ఆయుధ పూజ, శమీ పూజ, రావణ దహనం....

జర్నలిస్టు డైరీ-నాగోలు: రాక్ టౌన్ కాలనీలో విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. కాలనీలోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సుమారు 2 వేల మంది పిల్లలు, మహిళలు, పెద్దలు పాల్గొని పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. రాక్ టౌన్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1998 నుంచి ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా ఆయుధ పూజ, శమీ పూజ, రావణ దహనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
కాలనీవాసులందరినీ సమన్వయం చేసుకుంటూ పండుగలను వైభవంగా నిర్వహిస్తున్న కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్ రెడ్డిని పలువురు అభినందించారు. కమిటీ సభ్యులు, కాలనీవాసుల సహకారంతోనే కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ..
కాలనీలో పండుగలను విజయవంతంగా

నిర్వహించడంలో కమిటీ సభ్యులు, మహిళలు, పిల్లలు, కాలనీవాసుల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరి సహకారంతోనే వేడుకలను ఘనంగా జరుపుకోగలుగుతున్నామని పేర్కొంటూ, పాల్గొన్న వారందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.
పూజల అనంతరం జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం పంచుకుంటూ, అలయ్ బలయ్ చేసుకొని బంధుమిత్రులకు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చివరగా చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించే విజయానికి ప్రతీకగా రావణ దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా 'జై శ్రీరామ్' నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.
సనాతన ధర్మ విలువలను చాటుతూ, ఐక్యతను ప్రతిబింబించిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి.

హబ్సిగూడలో వైభవంగా దుర్గాదేవి అమ్మవారి శోభాయాత్ర.. పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, వజ్రేష్ యాదవ్

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) మల్కాజిగిరి కార్పొరేషన్ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడలో దుర్గాదేవి అమ్మవారి నిమజ్జనాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి హాజరై శోభాయాత్రలో పాల్గొన్నారు. అమ్మవారి శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. జై దుర్గామాత నినాదాలతో హబ్సిగూడ పరిసరాలు మార్మోగగా, పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. శోభాయాత్రలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు
- రక్తదానంతో మానవత్వానికి మహోన్నత సేవ...
- మల్కాజిగిరి సిపి బి సుమతి..

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ హెడ్క్వార్టర్స్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొని విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత అమర వీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించారు. అదేవిధంగా అమరులైన పోలీసులకు గౌరవ సూచకంగా గౌరవ వందనాన్ని అర్పించారు. అనంతరం
ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల త్యాగాలకు నిజమైన నివాళిగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాణాలను కాపాడే రక్తదానం ద్వారా మానవత్వం, సేవాభావం, సమాజం పట్ల బాధ్యతను చాటిచెపుతుందని సిపి సుమతి ఈ సందర్భంగా మాట్లాడుతూ పేర్కొన్నారు.
ఒక యూనిట్ రక్తం... ఒక ప్రాణానికి ఆశాకిరణం అని, అమరవీరుల త్యాగం మనకు స్ఫూర్తి అని, రక్తదానం మనిషికి పునర్జన్మగా పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని, వారి ధైర్యం, అంకితభావం, నిస్వార్థ సేవలు ప్రతి పోలీసు అధికారికి, ప్రతి పౌరుడికి స్ఫూర్తిదాయకం అన్నారు. వీరుల త్యాగం చిరస్మరణీయం, రక్తదానం ప్రాణదానం,
అమరవీరులకు శతకోటి వందనాలు అంటూ పోలీస్ అధికారులు
జై హింద్! జై పోలీస్! స్మరించుకున్నారు.

మునిసిపల్ కార్మికులకు బట్టల పంపిణీ....

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) చీర్యాలలో జై మాత ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అమ్మవారు నవరాత్రులు భాగంగా మున్సిపల్ కార్మికులు 10 రోజులు పారిశుధ్య సేవలు అందించిన కార్మికులకు చీరలు, బియ్యం అందజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీర్యాల జై మాత ఫ్రెండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

నాగారం డివిజన్
మున్సిపల్ కార్మికులకు బట్టల పంపిణీ....

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) దసరా పండుగ సందర్భంగా బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీలో మున్సిపల్ మహిళా సిబ్బందికి చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ మరియు ఆయన సతీమణి అక్కల రూపా పాల్గొని మహిళా మున్సిపల్ సిబ్బందికి చీరలు అందజేశారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ మహిళా సిబ్బందిని గౌరవిస్తూ, దసరా పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి
నివాసంలో దసరా వేడుకలు

జర్నలిస్ట్ డైరీ పరిగి అక్టోబర్ 21 విజయదశమి పర్వదినం సందర్భంగా పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి నివాసంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. రోజంతా నివాసంలోనే అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరికీ సంప్రదాయబద్ధంగా జమ్మి ఆకులు అందించి, ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఘనంగా
ముగిసిన దుర్గా శరన్నవరాత్రి వేడుకలు
- పది రోజుల పాటు వివిధ అలంకరణల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

యాచారం, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ): యాచారం మండలం కొత్తపల్లి గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని శ్రీ అన్నపూర్ణాదేవి సన్నిధిలో నిర్వహించిన దుర్గా శరన్నవరాత్రి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. రుత్వికులు వట్టిపల్లి ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో పది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ ఒక్కో అలంకరణలో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేపట్టారు. శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రామస్తులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. పది రోజుల పాటు కొనసాగిన ఆధ్యాత్మిక వేడుకలు భక్తుల్లో భక్తిభావాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కాలే అనితా రమేష్, వార్డు సభ్యులు వంగ సంజీవ రెడ్డి, వంగ వెంకట్ రెడ్డి, మాల్ రెడ్డి విష్ణు రెడ్డి, సురేందర్ రెడ్డి, భాస్కర్ చారి, శివ, శ్రీకాంత్, దేపా విజయశ్రీ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

జహార్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై మరో ముందడుగు...
మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) జహార్ నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27 నుంచి పాదయాత్ర నిర్వహించాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ నిర్ణయించారు. జహార్ నగర్ బాధితులతో ఈ నెల 23న సమావేశంతో పాటు 25 న మేధావులు, పర్యావరణవేతలతో డంపింగ్ యార్డ్ ఏరియాలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎంపి వర్గాలు తెలిపాయి.

మిట్టకోడూర్‌లో ఘనంగా దసరా వేడుకలు,
కులాలకు, పార్టీలకతీతంగా ఆత్మీయ కలయిక

జర్నలిస్ట్ డైరీ పరిగి, అక్టోబర్ 21 వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామంలో విజయదశమి (దసరా) పండుగ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో, సామరస్యంగా జరిగాయి. గ్రామంలోని ప్రజలందరూ రాజకీయ విభేదాలు, పార్టీలకు, మతాలకు, అతీతంగా ఒకే తాటిపైకి వచ్చి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పెద్దలు, యువకులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం, ఒకరికొకరు జమ్మి ఆకులను ఇచ్చిపుచ్చుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, ఆత్మీయ ఆలింగనాలతో గ్రామంలో ఐక్యతను చాటారు. గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, యువత అంతా ఒక్కటై పండుగ సందడిని పంచుకోవడం గ్రామస్తుల్లో ప్రత్యేక ఆనందాన్ని నింపింది. ముఖ్యంగా ఈ వేడుకల్లో ముస్లిం సోదరులు సైతం స్వచ్ఛందంగా పాల్గొని హిందూ సోదరులకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆలింగనం చేసుకోవడం విశేషం. మత సామరస్యానికి, గంగా-జమునా తెహజీబ్‌కు నిదర్శనంగా నిలిచిన ఈ కలయిక గ్రామంలోని సోదరభావాన్ని మరింత ఇనుమడింపజేసింది. కుల, మత, రాజకీయ విభేదాలకు తావులేకుండా అందరూ ఒక్కటైన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన నాగారం బిజెపి నాయకులు...



నాగారం, అక్టోబర్ 21:-(జర్నలిస్ట్ డైరీ) దసరా పర్వదినం సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నారపరాజు రామచందర్ రావు పలువురు బిజెపి నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారందసరా పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర అధ్యక్షుడిని నాగారం బిజెపి నాయకులు ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి, మాజీ కౌన్సిలర్ బీజ్జ శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్, ఆర్. రవీందర్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ప్రాంతానికి, మన ఊరికి
మంచి పేరు తీసుకురావాలి..
- షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్
-విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు - మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆగీరు లక్ష్మీప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ నివాసానికి చేరుకున్న వారు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. అలాగే లక్ష్మీప్రసాద్ తల్లిదండ్రులు ఆగీరు వెంకటేష్, చంద్రకళ దంపతులను సైతం శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య మనిషిని ఉన్నత శిఖరాలకు చేర్చే గొప్ప సాధనమని, విద్యను సద్వినియోగం చేసుకున్న వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని తమ ప్రాంతానికి, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు, త్యాగాలు చేసి పిల్లలను చదివిస్తారని, వారి కష్టానికి తగిన ఫలితాన్ని అందిస్తూ పిల్లలు జీవితంలో ప్రయోజకులైనప్పుడే తల్లిదండ్రుల ఆశలు నెరవేరుతాయని అన్నారు.
ఆగీరు లక్ష్మీప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం షాద్‌నగర్ ప్రాంతానికి గర్వకారణమని, ఆయన విజయం ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పట్టుదల, కృషి, విద్య పట్ల అంకితభావం ఉంటే లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. భవిష్యత్తులో న్యాయమూర్తిగా ప్రజలకు న్యాయం అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆగీరు రవికుమార్ గుప్తా, సామాజికవేత్త కేకే కృష్ణ, గుట్ట రాజు, కౌన్సిలర్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి
ఆలయంలో ఐమాక్స్ లైట్ల ప్రారంభం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభం
- ఆలయ ఆవరణలో నూతన వెలుగులతో భక్తులకు మరింత సౌకర్యం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆలయ ఆవరణలో భక్తులకు మెరుగైన వెలుగులు, సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నూతన లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దేవాలయ పరిసరాలు పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, బీజేపీ నాయకులు అందే బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, దిలీప్, అశోక్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, కేకే కృష్ణ, సర్వర్ పాషా, ముబారక్ అలీ ఖాన్, వెంకట్ సాయిశ్వర్ రెడ్డి, భూపాల్, సత్యనారాయణ, మాధవులు యాదవ్, శేఖర్, మనీష్, రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లపై.. రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత

-నామినేషన్ల దాఖలుకు నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం లేదని వెల్లడి

-ఈ కారణంతో నామినేషన్లను తిరస్కరించవద్దని అధికారులకు ఆదేశం

-నామినేషన్ల అడ్డంకులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రకటన

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలకమైన స్పష్టత ఇచ్చింది. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్‌ఓసీ) లేదా 'నో డ్యూస్ సర్టిఫికెట్' సమర్పించాల్సిన అవసరం లేదని బుధవారం స్పష్టం చేసింది.

ఎస్ఈసీ ప్రకటన విడుదల

ఈ మేరకు అమరావతి నుంచి ఎస్ఈసీ ఒక ప్రకటన విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల చట్టాల ప్రకారం ఈ పత్రాలు తప్పనిసరి కాదని పేర్కొంది. కేవలం ఈ సర్టిఫికెట్లు లేవన్న కారణంతో నామినేషన్ల స్వీకరణను నిలిపివేయవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, నామినేషన్‌కు అవసరమైన ఇతర పత్రాలను మాత్రం అభ్యర్థులు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది.

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ స్పష్టత ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదాల నేపథ్యంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, నామినేషన్ల అడ్డంకులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే ప్రభావిత ప్రాంతాల్లో కనీసం 48 గంటల పాటు గడువు పొడిగింపుపై గురువారం నాటికి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అలాగే, అక్టోబర్ 25 వరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని ఆదేశించింది. ఈ పరిణామాల మధ్య, ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఎస్ఈసీ ఈ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది

స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్ డ్రామాలు ఆడుతున్నారు... దేవినేని ఉమా

-కూటమి అభ్యర్థులు 90 శాతం స్థానాలు గెలవడం ఖాయమని జోస్యం

-వైసీపీ నేతలే నామినేషన్ పత్రాలు చింపుకుని బురదజల్లుతున్నారని ఆరోపణ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమనే భయంతోనే వైసీపీ అధినేత జగన్ సరికొత్త డ్రామాలకు తెరలేపారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 90 శాతానికి పైగా స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నామినేషన్ పత్రాలను స్వయంగా చించుకుని...

వైసీపీ నేతలే తమ నామినేషన్ పత్రాలను స్వయంగా చించుకుని, ఆ నెపాన్ని పోలీసులు, ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేవినేని ఉమా మండిపడ్డారు.

పోలీసులపై దాడులు చేయడం ఏ సంస్కృతి?"

"నామినేషన్లకు వెళ్తున్నారా? యుద్ధానికి వెళ్తున్నారా? పోలీసులపై దాడులు చేయడం ఏ సంస్కృతి?" అని ఆయన ప్రశ్నించారు. దర్శిలో మహిళా కానిస్టేబుల్, ఎస్సైల తలలు పగలగొట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో వైసీపీనే విధ్వంసం సృష్టించి, ఆ నెపాన్ని ప్రభుత్వంపై వేస్తోందని ఆరోపించారు.

నామినేషన్లు వేయమని జగన్ బతిమాలుకునే దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా...

పులివెందులలో కిందిస్థాయి నేతలను నామినేషన్లు వేయమని జగన్ బతిమాలుకునే దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గతంలో పట్టిసీమ పంపులు పీకేస్తానని అన్న జగన్, ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో అవే నీళ్లు తాగుతున్నారని విమర్శించారు. చంద్రబాబు దూరదృష్టితో తెచ్చిన పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులే రాయలసీమ, విశాఖ, కృష్ణా డెల్టాలను కాపాడుతున్నాయని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై కూడా వైసీపీ మీడియా వక్రభాష్యాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి... అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

-నిత్యవసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీఎం ఆదేశం

-ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచన

-పీఎం సూర్యఘర్ కనెక్షన్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్న చంద్రబాబు

-ఇసుక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశ వ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలి

రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.

ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళల పట్ల దురుసు ప్రవర్తనా? ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

- లక్డీకాపూల్ బస్‌స్టాప్‌లో మహిళకు ఇబ్బందులు ఎదురైనట్లు ఆరోపణలు

హైదరాబాద్ జర్నలిస్ట్ డైరీ ప్రతినిధి :
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో, కొందరు ఆర్టీసీ సిబ్బంది మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళలను అభ్యంతరకర పదజాలంతో దూషించడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బుధవారం (అక్టోబర్ 21) హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ బస్‌స్టాప్ వద్ద ఫరూఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఒక మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించి, అభ్యంతరకరంగా మాట్లాడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన అంశంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం.

ఈ ఘటనలో బాధితురాలిగా పేర్కొంటున్న మహిళ తనకు ఎదురైన అనుభవంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మహిళ ప్రశ్నించినప్పుడు కూడా డ్రైవర్ తీరులో మార్పు లేకుండా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, డ్రైవర్ వివరణ, అధికారుల స్పందన ఇంకా తెలియాల్సి ఉంది.

మహిళలతో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత లేదా?

ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వారి ప్రయాణ ఖర్చులను తగ్గించడంతో పాటు ప్రజా రవాణాలో భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో అమలవుతోంది. ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే మహిళలతో గౌరవంగా వ్యవహరించడం ఆర్టీసీ సిబ్బంది బాధ్యత.

టికెట్, ప్రయాణ అర్హత లేదా ఇతర విధివిధానాలకు సంబంధించిన సమస్యలు తలెత్తితే నిబంధనల ప్రకారం వివరించి పరిష్కరించాలి. ప్రయాణికులను దూషించడం, అవమానించడం లేదా బెదిరించడం వంటి ప్రవర్తనకు తావుండకూడదు.

ఒక మహిళ తనకు ఎదురైన అనుభవంపై ప్రశ్నించినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, మాట్లాడలేని పరిస్థితిలో ఉన్న సామాన్య మహిళలు ఇలాంటి సందర్భాల్లో మరింత ఇబ్బందులకు గురవుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశంపై అధికారులు దృష్టి సారించి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది.

విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

లక్డీకాపూల్ బస్‌స్టాప్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ ఘటనపై ఫరూఖ్‌నగర్ డిపో అధికారులు, సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సులోని సీసీటీవీ దృశ్యాలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలు పరిశీలించి ఘటనలో వాస్తవాలను నిర్ధారించాలని, బాధితురాలి వాదనను కూడా నమోదు చేయాలని కోరుతున్నారు.

ప్రజా రవాణా వ్యవస్థపై మహిళలకు నమ్మకం ఉండాలంటే సిబ్బంది మర్యాదపూర్వక ప్రవర్తనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో, ఘటనకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి నిష్పక్షపాతంగా నిర్ణయం తీసుకోవడం అవసరం.

మహిళల గౌరవం, భద్రత విషయంలో రాజీ పడకుండా సంబంధిత ఆర్టీసీ అధికారులు ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాశమైలారంలో ఘనంగా విజయదశమి వేడుకలు

-వైభవంగా రావణ దహనం.. ముఖ్య అతిథిగా కాటా శ్రీనివాస్ గౌడ్

-భారీగా తరలివచ్చిన ప్రజలు.. పాశమైలారంలో పండుగ సందడి

పటాన్‌చెరు అక్టోబర్ 21 జర్నలిస్ట్ డైరీ :
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం వార్డులో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో సంప్రదాయబద్ధంగా జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పాశమైలారంలో పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్, కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దుర్గాభవాని మాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సంప్రదాయాలను కాపాడుతూ ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిత సుధాకర్ గౌడ్, సాయి గౌడ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయదశమి వేడుకలను విజయవంతం చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

వైసీపీకి షాక్.. మంత్రి లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన కీలక నేత

-మంగళగిరిలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

-మంత్రి లోకేశ్ సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నేత రజనీకాంత్

-స్థానిక ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలవాలని పిలుపు

-మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న లోకేశ్

-రజనీకాంత్‌తో పాటు టీడీపీ తీర్థం పుచ్చుకున్న 25 కుటుంబాలు

మంగళగిరి,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : మంగళగిరి నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, గుంటూరు పార్లమెంట్ వైసీపీ ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్ తన మద్దతుదారులతో కలిసి టీడీపీలో చేరారు. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు, మరో 25 కుటుంబాలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. "2024 సార్వత్రిక ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లోనే ఎక్కువ మెజార్టీ సాధించాలి. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. ఎన్డీయే పక్షాన నిలబడటమే మనకు శ్రీరామరక్ష. అప్పుడే మనం అనుకున్న అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

గత పదేళ్ల పాలనను, తన రెండున్నరేళ్ల పనితీరును బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని లోకేశ్ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ, ఆసుపత్రి, కమ్యూనిటీ భవనాలు, పార్కులు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అహర్నిశలు పనిచేస్తానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎంపీపీ అయిన రజనీకాంత్‌తో పాటు, చిలువూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ యాళ్ల జయలక్ష్మి, ఇతర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్.. సిఎం చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

-పిటిషన్లతో ఎన్నికలు, అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపణ

-జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలని నేతలకు సూచన

-క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు

అమరావతి, ఏపీ బ్యూరో జర్నలిస్ట్ డైరీ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో జగన్ లాంటి 'క్రిమినల్ లిటిగెంట్లు' ఉండటం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయి....

తానే విధ్వంసానికి పాల్పడి, తానే కోర్టుకు వెళ్లే వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయని చంద్రబాబు అన్నారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేవలం స్థానిక ఎన్నికలనే కాకుండా, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వందల సంఖ్యలో పిటిషన్లు వేశారని ఆరోపించారు. ఓటరు జాబితా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారని గుర్తు చేశారు.

కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచే యాలి

స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసకారులను బరిలోకి దించుతోందని ఆరోపించారు. బెంగళూరులో కూర్చొని జగన్ విధ్వంస రచనలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి గుండాలను దించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు

ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకం కావాలని

ఎన్నికల ప్రచారానికి వారం రోజులే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూనే, వైసీపీ అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. వికృత మనస్తత్వం ఉన్నవారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

-నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారంటూ వైసీపీ పిటిషన్

-అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు

-సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపి వేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైసీపీ

రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేక పోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ప్రజాస్వామ్య బద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది.

అక్టోబర్ 22వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి ఆదేశం

ఈ నేపథ్యంలో, వైసీపీ చేసిన ఫిర్యాదులను, సమర్పించిన ఆధారాలను కేసుల వారీగా పరిశీలించి అక్టోబర్ 22వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని స్పష్టం చేసింది. అక్టోబర్ 25న తుది జాబితాను విడుదల చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని ఎస్ఈసీ తన ప్రకటనలో తెలియజేసింది

పులివెందులలో దాడుల పర్వం.. వైసీపీ నేతల ఆస్తులే లక్ష్యంగా దాడులు... వైఎస్ అవినాశ్ రెడ్డి

-పులివెందులలో వైసీపీ నేతల ఆస్తులపై దాడులు జరుగుతున్నాయన్న అవినాశ్ రెడ్డి

-చికెన్ సెంటర్, కౌన్సిల్ అభ్యర్థి చెక్ బుక్కులు తగలబెట్టారని తీవ్ర ఆగ్రహం

-భయపెట్టేందుకు 900 కేసులు పెట్టారని మండిపాటు

పులివెందుల,కడప, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : పులివెందులలో వైసీపీ నాయకుల ఆస్తులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని, దీని వెనుక అధికార కూటమి నేతల హస్తం ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, వైసీపీ నేతల ఆస్తులను ధ్వంసం చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఇతర ప్రాంతాల్లోనూ ఈ దాడులు

గత వారం రోజులుగా పులివెందులతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఈ దాడులు కొనసాగుతున్నాయని అవినాశ్ రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల క్రితం పులివెందులలో ఓ చికెన్ సెంటర్‌ను తగలబెట్టారని, ఈ ఘటనలో టీడీపీ నేతలు విజయ్ కుమార్ రెడ్డి, షమీర్‌ల ప్రమేయం స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

చెక్ బుక్కులను కూడా కాల్చివేశారు

అలాగే, కౌన్సిల్ అభ్యర్థి నిరంజన్ రెడ్డికి చెందిన చెక్ బుక్కులను కూడా కాల్చివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాడుల గురించి స్పష్టమైన సమాచారం ఉన్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఘటనల సమయంలో పోలీసులు అక్కడే ఉండి హింసను ప్రోత్సహిస్తున్నారనే అనుమానం కలుగుతోందని అన్నారు.

900కి పైగా కేసులు నమోదు

నామినేషన్ కేంద్రం వద్ద జరిగిన ఘటనకు సంబంధించి 900కి పైగా కేసులు నమోదు చేశారని, సంబంధం లేని వారిని కూడా అరెస్టు చేస్తున్నారని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. భయాందోళనలు సృష్టిస్తే వైసీపీ కార్యకర్తలు ప్రచారానికి రారని అధికార పక్షం భావిస్తోందని విమర్శించారు. పోలీసు, పరిపాలన యంత్రాంగంతో ఈ విధమైన బుల్డోజర్ పాలన అవసరమా? అని ఆయన ప్రశ్నించారు. ఓ ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టే ప్రయత్నం చేయడం, అభివృద్ధి పనుల కోసం కేటాయించిన బైక్‌ను తగలబెట్టడం వంటి ఘటనలు కూడా జరిగాయని చెప్పారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసి, ప్రచారం చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు

'చెప్పాం.. చేస్తున్నాం'.. స్థానిక ఎన్నికలకు చంద్రబాబు కొత్త నినాదం!

-స్థానిక ఎన్నికలపై టీడీపీ ముఖ్య నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

-'చెప్పాం.. చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు

-రెబల్స్‌గా నామినేషన్లు వేస్తే సస్పెన్షన్ తప్పదని కఠిన హెచ్చరిక

-కూటమి పార్టీలతో సమన్వయంతో పనిచేసి -మిత్రధర్మాన్ని పాటించాలని సూచన

-టికెట్ రాని నేతలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. నేడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీలతో సమన్వయంపై కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే రెబెల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, అదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదం పొందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని గుర్తుచేశారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమగ్రంగా వివరించాలని ఆయన నేతలకు పిలుపునిచ్చారు.

పూర్తి సమన్వయంతో పనిచేయాలన్న చంద్రబాబు

కూటమిలోని జనసేన, బీజేపీ పార్టీలతో పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సీట్ల సర్దుబాటు ప్రక్రియను సాఫీగా, సామరస్యపూర్వకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిత్రధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, జనసేన, బీజేపీలకు కేటాయించిన స్థానాల్లో కూడా రెబెల్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కిచెప్పారు.

నామినేటెడ్ పదవుల ద్వారా న్యాయం

టికెట్లు ఆశించి భంగపడిన నేతలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల ద్వారా న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రెబెల్స్‌గా నామినేషన్లు వేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారు వెంటనే తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. ప్రజలకు సేవ చేసే మంచి అభ్యర్థులను ఎంపిక చేయాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి..
వైసిపి నేత,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

-19 మున్సిపాలిటీల్లో గెలుస్తామన్న పెద్దిరెడ్డి

-నామినేషన్ల ప్రక్రియలో తమ అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణ

-మిథున్ రెడ్డిపై ఐదు కేసులు పెట్టారని మండిపాటు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తమ పార్టీకి ఎంతో బూస్ట్ ఇచ్చాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు నేపథ్యంలో 19 మున్సిపాలిటీ లలో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ...
నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. తమ వారిని నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, గందరగోళం సృష్టించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. అదే సమయంలో టీడీపీ నేతలు సులభంగా నామినేషన్లు వేసేందుకు పోలీసులు సహకరించారని విమర్శించారు.

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ
పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైసీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి, నోటీసులు జారీ చేస్తున్నారని పెద్దిరెడ్డి ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డిని ఐదు కేసుల్లో ఏ-1గా చేర్చారని ఆయన తెలిపారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కేసులు పెట్టినా తమ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించి, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పిఓలకు, ఏపీఓలకు నేడు శిక్షణ

ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఎన్నికల విధుల నిర్వహణపై పోలింగ్ ఆఫీసర్లు (పి.ఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు (ఏపీఓ)లకు గురువారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అర్బన్ ఎలక్షన్స్ నోడల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఒంగోలు అసిస్టెంట్ కమిషనరుకు, అద్దంకి, దర్శి, చీమకుర్తి మున్సిపాలిటీల కమిషనర్లకు ఆయన చెప్పారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిబ్బందికి పిఓ హ్యాండ్ బుక్, పీపీటీ అందించి ఎం ఓ టి ఆర్వో ఏ ఆర్ ఓ ఈవో ఏఈఓ ల చేత ట్రైనింగ్ ఇప్పించాలన్నారు. శిక్షణ అనంతరం ఆయా అంశాలపైన సిబ్బంది అవగాహన పరిశీలించేందుకు ప్రత్యేక పరీక్ష కూడా నిర్వహించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వారీగా రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ



లఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వారీగా రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను అధికారులు బుధవారం నిర్వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కె.హెప్సిబారాణి, వ్యయ పరిశీలకులు వివేక్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి సమక్షంలో ప్రకాశం భవనంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఆన్ లైన్ లో చేపట్టి సిబ్బందికి కోడ్ కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.వి. రమణ, అర్బన్ ఎలక్షన్స్ నోడల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, సిపిఓ సుధాకర్ రెడ్డి, ఎన్ఐసి ఆఫీసర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఓసి, నో డ్యూస్ సర్టిఫికెట్లు లేకపోయినా నామినేషన్లు వేయవచ్చు: కలెక్టర్ స్పష్టీకరణ

ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ ;
జిల్లాలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. తొలిరోజు నామినేషన్లు వేసేవారు ఎలాంటి ఇబ్బందీ పడకుండా సంబంధిత పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. ఈ ఎన్నికలకు బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభమైన నేపథ్యంలో ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు,జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలోని ఎన్నికల మీడియా సెంటర్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వీటి వివరాలను ఆయన వెల్లడించారు. తనతో పాటు ఎస్పీ కూడా బుధవారం జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి నామినేషన్ల తీరును పరిశీలించామన్నారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరులో నామినేషన్లకు చేసిన ఏర్పాట్లను స్వయంగా తాను పరిశీలించినట్లు కలెక్టర్ చెప్పారు. నామినేషన్ల దాఖలుకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలని అధికారులకు, పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నామినేషన్ వేసే వ్యక్తితో పాటు మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించాలని చెప్పామన్నారు. నామినేషన్ దాఖలులో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్లో 1077 టోల్ ఫ్రీ నెంబర్తో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, దీని ద్వారా తమ దృష్టికి తీసుకురావచ్చు అని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

ఎన్ఓసి, నో డ్యూస్ సర్టిఫికెట్లు
లేకపోయినా నామినేషన్లను వేయ్యొచ్చు

ఎన్ఓసి, నో డ్యూస్ సర్టిఫికెట్లు లేకపోయినా అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. కుల ధృవీకరణ పత్రాల జారీ సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే అభ్యర్థులకు ఇబ్బంది ఎదురుకాకుండా సంబంధిత తహసిల్దార్ ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

మునిసిపల్ ఎన్నికలకు నామినేషన్ల సమయంలో దర్శిలో చోటు చేసుకున్న పరిణామాల దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించకుండా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

ఎస్పీ మాట్లాడుతూ...
కందుకూరు, సింగరాయకొండ ప్రాంతాలలో పర్యటించి భద్రతాపరంగా చేపట్టిన చర్యలను పరిశీలించినట్లు చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ల సెంటర్లకు ' వంద మీటర్ల ' నిబంధన కచ్చితంగా అమలయ్యేలా చూస్తున్నామని అన్నారు. పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్స్ పెట్టడంతో పాటు సీసీటీవీల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు కూడా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగానికి, పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎటువంటి అవాంతరాలు జరగకుండా నామినేషన్లు వేయాలి

-జిల్లాలో 'నామినేషన్' ప్రక్రియ'ను పరిశీలించిన కలెక్టర్

-తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి తదితర ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్

-దర్శి ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించాం

ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ
జిల్లాలో 27 జడ్పిటిసి 373 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలైందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు.
బుధవారం తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి తదితర ప్రాంతాల్లో పర్యటించి నామినేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిబంధనల మేరకు నామినేషన్లు వేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల నియమావళి అనుసరించి అభ్యర్థితోపాటు తక్కువ మందిని అనుమతించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎలక్షన్స్ సంబంధించి జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని దర్శి ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించడం జరిగిందన్నారు. వెబ్ కాస్టింగ్ తో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వారితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా తమ వంతు సహాయ సహకారాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన రాజకీయ పార్టీలను కోరారు. ఎన్నికల నిబంధనల మేరకు 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఉండడం నిషేధం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.'

భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జన ఊరేగింపు

మిడ్జిల్‌లో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలకు ముగింపు

**మిడ్జిల్,
అక్టోబర్ 21,జర్నలిస్ట్ డైరీ :**
మిడ్జిల్ మండల కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న దుర్గామాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమాన్ని ఈదమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తితో పూజలు నిర్వహించారు. గ్రామ వీధులన్నీ పండుగ శోభను సంతరించుకోగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈదమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సేవలో పాల్గొన్న భక్తులు, ఉత్సవాల విజయవంతానికి సహకరించిన కమిటీ సభ్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతను చాటిచెప్పేలా శరన్నవరాత్రి వేడుకలు ముగిశాయి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465